## క్లుప్తంగా

### చేనేత మగ్గాల పరిశీలన

పొదలకూరు : పట్టణంలోని చేనేత కార్మికుల మగ్గాలను చేనేత, జౌళి శాఖ ఏడీ ఆనందరావు బుధవారం పరిశీలించారు. ఇటీవల పొదలకూరులో చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్‌కు జాతీయ చేనేత ఐక్యవేదిక నాయకులు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ చేనేత మగ్గాలను పరిశీలించి నివేదిక సమర్పించాల్సిందిగా ఏడీను ఆదేశించారు. ఈ మేరకు చేనేత కార్మికుల మగ్గాలను ఏడీ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నేతలు పముజుల శంకరయ్య, సీహెచ్ చినసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పొదలకూరు మండలంలో 400 కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధిపొందుతున్నారని చెప్పారు. పట్టణంలో వంద అంకణాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి చేనేత క్లస్టర్ నిర్మిస్తే నేతన్నలకు అండగా ఉంటుందని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

### గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలందించాలి

మనుబోలు : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని తెలుగుగంగ డిప్యూటీ కలెక్టర్ చినఓబులేసు వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని చెర్లోపలిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య స్థితిగతులు, వారికందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది ఇళ్లకు వచ్చి అవసరమైన మందులు అందజేస్తున్నారా..లేదా..అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సర్వే సందర్భంగా ఎలాంటి ప్రశ్నలు అడగాలి, ఎలాంటి డేటా సేకరించాలో వైద్య సిబ్బందికి సూచించారు. అక్టోబర్ 17న గ్రామంలో జరిగే ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను జయప్రదం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, కార్యదర్శి అనిత, ఏఎన్‌ఎం శివరూపిణి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు అమ్మవారిపాళెం విద్యార్థులు

పొదలకూరు : రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు మండలంలోని అమ్మవారిపాళెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీ సురేంద్రకుమార్ బుధవారం తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన 67వ స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ఎం అస్మిత అండర్-14 త్రోబాల్, నాగినేని పల్లవి, వీరేపల్లి కుసుమ అండర్-17 ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. వీరు త్వరలో కర్నూలు, నంద్యాలలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం విజయకుమార్, ఉపాధ్యాయులు సుభాషిణి, ఖాజారంతుల్లా, విజయభాస్కర్ అభినందించారు.

### శాస్త్రీయ పద్ధతులతో మత్స్యసాగు లాభదాయకం

తోటపల్లిగూడూరు : శాస్త్రీయ పద్ధతుల్లో మత్స్యసాగు చేపడితే లాభదాయకంగా ఉంటుందని ఇందుకూరుపేట డివిజన్ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి(ఎఫ్‌డీఓ) సంజయ్ స్టీఫెన్ పేర్కొన్నారు. వైఎస్సార్ మత్స్య సాగుబడిలో భాగంగా కోడూరు గ్రామంలోని కావలిరెడ్డి రంగారెడ్డి రొయ్యల గుంతలను మత్స్యశాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం వైఎస్సార్ మత్స్య సాగుబడి ద్వారా చేపలు, రొయ్యలు సాగు చేపడుతున్న రైతులకు అన్ని రకాలుగా చేయూత అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకుని ఆక్వారంగంలో అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం మత్స్యశాఖ అధికారులు ఆక్వా రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నేతలు కావల్‌రెడ్డి రంగారెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, గ్రామ మత్స్యశాఖ అసిస్టెంట్ సుప్రియ, సాగర మిత్రలు పాల్గొన్నారు.

### యాజమాన్య పద్ధతులు పాటించాలి

మనుబోలు : రైతులు పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ మారుతీదేవి సూచించారు. మనుబోలు సచివాలయం-2 పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. కాండం తొలిచే పురుగు నివారణకు పైరు దశలో గుళికలు వాడితే ఖర్చు ఎక్కువ అవుతుందని, దానికి బదులుగా వరినాట్లు వేసే వారం ముందు పొలంలో గుళికలు వేయాలన్నారు. పొట్ట దశలో తెల్లకంకి నివారణకు, చిరుపొట్ట దశలో మెడ విరుపు నివారణకు ఏ మోతాదుల్లో ఎరువులు వాడాలో రైతులకు సూచించారు. రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలని, వాటి స్థానంలో సేంద్రీయ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యూరియా, జింక్, డీఏపీలు తగిన మోతాదులోనే వాడాలన్నారు. ఈ సదస్సులో ఏఓలు జహీర్, గీతా మాధురి, ఇఫ్కో సేల్స్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, సైంటిస్ట్ తేజస్విని, ఏఏఓ కళారాణి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తాం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్: నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో రూరల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటును అందిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. రూరల్ మండలం కొత్తవెల్లంటి వాసులు ఇటీవల పాతవెల్లంటి-కొత్తవెల్లంటి మధ్యన రోడ్డు అధ్వానంగా ఉందని, నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణానికి బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి జెడ్పీ నిధులు కేటాయిస్తామన్నారు. కొత్తవెల్లంటిలో జెడ్పీ నిధులు రూ.16 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు రూ.5 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## డీకేడబ్ల్యూలో ఆర్నమెంటల్ ఫిషరీ కోర్సు ప్రారంభం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జువాలజీ, ఆక్వాకల్చర్ విభాగాల ఆధ్వర్యంలో ఆర్నమెంటల్ ఫిషరీ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి తెలిపారు. బుధవారం కళాశాలలో కోర్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్ కోర్సులో ఆర్నమెంటల్ చేపల పెంపకంపై సమగ్రంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోర్సులో చేరేందుకు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు, గృహిణులు అర్హులని చెప్పారు. కోర్సు వ్యవధి రెండు నెలలు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు జువాలజీ హెచ్‌ఓడీ రంజని 94913 21150 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## వామపక్షాల నిరసన



నెల్లూరు(దర్గామిట్ట): విద్యుత్ సవరణ బిల్లును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ వామపక్ష నాయకులు బుధవారం కలెక్టర్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ , సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీ రాఘవులు మాట్లాడుతూ ప్రభుత్వం అదనపు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం సబబు కాదన్నారు. నాయకులు మాలకొండయ్య, అరికెల నాగేంద్రసాయి, సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హక్కుల కోసం 'తోట' రాజీలేని పోరాటం



ఎన్జీఓ భవన్‌లో నివాళులర్పిస్తున్న ఎన్‌జీఓ నాయకులు



కలెక్టరేట్‌లో సుధాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్పెషల్ కలెక్టర్ చినఓబులేసు

నెల్లూరు(దర్గామిట్ట): ఉద్యోగుల హక్కులు, వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కామ్రేడ్ సుధాకర్ ప్రసాద్ రాజీలేని పోరాటం చేశారని తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ చినఓబులేసు పేర్కొన్నారు. ఏపీ ఎన్జీఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్ వర్ధంతిని కలెక్టరేట్‌లోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. టీజీపీ స్పెషల్ కలెక్టర్ పాల్గొని సుధాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగ సంఘ నేతగా సుధాకర్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉద్యోగుల హక్కుల కోసం, వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాజీలేని పోరాటం చేశారన్నారు. ఈ పోరాటంలోనే అసువులు బాసిన సుధాకర్ ప్రసాద్‌ను ఉద్యోగులు మరువలేరన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, డేనియల్ పీటర్, బాలకోటమ్మ, శేషయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**తోటకు ఘన నివాళులు**

నెల్లూరు(పొగతోట): నగరంలోని ఎన్‌జీఓ హోంలో ఏపీఎన్‌జీఓ నేత తోట సుధాకర్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. సుధాకర్ చిత్రపటానికి ఎన్‌జీఓ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తోట సుధాకర్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యల సాధనకు చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ నాయకులు నాయుడు వెంకటస్వామి, విజయకుమార్, లక్కాకుల పెంచలయ్య, స్వర్ణలత, సురేష్ పాల్గొన్నారు.

## హైటెక్ నిసాన్ మెగా ఉచిత సర్వీస్ క్యాంప్



తిరుపతి కల్చరల్: నెల్లూరు ఆటోనగర్‌లోని సీజేఎస్ హైటెక్ నిసాన్ ఆధ్వర్యంలో కస్టమర్ల సౌకర్యార్థం బుధవారం మెగా ఉచిత సర్వీస్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎస్‌వీఎస్.శాస్త్రి మాట్లాడుతూ ఈ క్యాప్‌లో వాహనాలకు వాటర్ సర్వీస్, జనరల్ చెకప్ ఉచితంగా అందించినట్లు తెలిపారు. క్యాంప్‌ను గురువారం కూడా నిర్వహిస్తున్నామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలి రోజు సుమారు 50 మందికి ఉచిత సర్వీస్ అందించారు. కార్యక్రమంలో కంపెనీ ఎండీ సి.జగన్నాథరెడ్డి, డైరెక్టర్లు సి.నిరంజన్, హోషియారెడ్డి, సర్వీస్ మేనేజర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ సహకారంతో డెయిరీ అభివృద్ధి



కోవూరు : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నెల్లూరు విజయ డెయిరీని లాభాల బాటలో తీసుకెళ్లి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. పడుగుపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో విజయ డెయిరీ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి రంగారెడ్డి హాజరై రైతులనుద్దేశించి మాట్లాడారు. పాడి రైతులకు మేలు జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం డెయిరీ చైర్మన్‌ను రైతులు, బోర్డు సభ్యులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో డెయిరీ ఎండీ కృష్ణమోహన్, డైరెక్టర్లు కృష్ణారెడ్డి, సుబ్బరాయుడు, భవానీరెడ్డి, దశరథ రామిరెడ్డి, సునీల్‌రెడ్డి, హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్‌కు ఘన నివాళులు



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో భగత్‌సింగ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని 6, 16, 17 డివిజన్లలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంవీ రమణ, జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య కోసం 23 ఏళ్లకే ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు జగదీష్ ,శేఖర్‌రాయుడు, కుమార్,సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి




నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న లాయర్లు.

నెల్లూరు (లీగల్): న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం అమలుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్ బెనిఫిట్స్‌ను రూ.12 లక్షలకు పెంచాలని, నివేశన స్థలాల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుందరయ్య, మాజీ కార్యదర్శి నావూరు శ్రీధర్, అబ్బాయిరెడ్డి, బ్రహ్మం, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న స్టేట్ ఒకేషనల్ ఇన్‌చార్జి భారతి

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ఒకేషనల్ పాఠశాలల్లోని ఇన్‌స్ట్రక్టర్లకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పొదలకూరురోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి స్టేట్ ఒకేషనల్ ఇన్‌చార్జి భారతి ముఖ్యఅతిథిగా హాజరై లెసెన్ ప్లాన్స్, డైరీలు ఏ విధంగా రాయాలి, మెడల్స్‌ను ఎలా ప్రిపేర్ చేయాలి, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఒకేషనల్‌కు సంబంధించి ప్రొసీడింగ్ వివరాలు, విధులు, బాధ్యతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ఏఎంఓ సుధీర్‌బాబు, జీసీడీఓ మమత పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్



మాట్లాడుతున్న లలితాశివజ్యోతి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని 25 ప్రభుత్వ పాఠశాలలను కిచెన్ గార్డెన్స్‌కు ఎంపిక చేసినట్లు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ లలితా శివజ్యోతి బుధవారం తెలిపారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు కిచెన్ గార్డెన్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఎంపిక చేసిన పాఠశాలలకు వచ్చే వారం నుంచి వివిధ రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కేవీకే శాస్త్రవేత్తలు కిచెన్ గార్డెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

## అధ్యాపకురాలికి డాక్టరేట్



ప్రసన్న

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న బూదూరు ప్రసన్నకు డాక్టరేట్ లభించింది. శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో జువాలజీ ప్రొఫెసర్ పీ జాకబ్‌దాస్ పర్యవేక్షణలో 'థయోడి కార్బ్ ఇన్‌ఫ్లూయెన్స్ ఆన్ ద సెంట్రల్ నెర్వస్ సిస్టం ఇన్ ఆల్బినోమైస్' అనే అంశంపై సాగించిన పరిశోధనలకు వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపల్, ఆర్ఐఓ శ్రీనివాసులుతో పాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛతే సేవ



స్వచ్ఛతే సేవ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నెల్లూరు (టౌన్): నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నెల్లూరు కార్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. స్థానిక కేఎన్నార్ మున్సిపల్ హైస్కూల్, పొదలకూరురోడ్డు జిల్లా పరిషత్తు హైస్కూల్, మూలాపేట రామయ్య బడి, తదితర పాఠశాలల్లో భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి ఆధ్వర్యంలో విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త రహిత దేశాన్ని మహాత్ముడికి నివాళిగా అందించే సంకల్పంతో వచ్చే నెల 2వ తేదీ వరకు భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాత్ముడి స్ఫూర్తితో స్వచ్ఛ భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

## షిర్డీ సాయినాథుడికి ఇరుముడిల సమర్పణ



షిర్డీకి చేరుకున్న సింహపురి సాయిభక్తులు

నెల్లూరు(బృందావనం): సింహపురికి చెందిన సాయినాథుడి భక్తులు 200 మంది షిర్డీలో సాయినాథుడికి బుధవారం ఇరుముడిలు సమర్పించారు. పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం చైర్మన్ మధుసాయి ఆధ్వర్యంలో సాయి మాలధారణతో షిర్డీకి వెళ్లిన భక్తులు సాయిబాబా మందిరం చుట్టూ మహాప్రదక్షిణ చేసి చావడి, ద్వారకామాయి మీదుగా మందిరంలోని బాబా సమాధిని దర్శించుకుని ఇరుముడిలను బాబా పాదాలకు స్పృశింపజేశారు. అనంతరం అక్కడి నుంచి గురుస్థాన్, నందదీపం చుట్టూ ప్రదక్షిణలు చేసి మందిరం ప్రాంగణంలోని వేప,రావి వృక్షాల వద్ద ఇరుముడిలను సమర్పించారు. అనంతరం షిర్డీ సంస్థాన్ వేదికపై సాయినామ సంకీర్తనలను ఆలపించారు. గురువారం షిర్డీ పురవీధుల్లో సింహపురి భక్తుల ఆధ్వర్యంలో సాయిబాబా పల్లకి ఉత్సవం నిర్వహించనున్నట్లు మధుసాయి తెలిపారు.

## సీఎంఏలో జెనెక్స్ విద్యార్థుల ప్రభంజనం




విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నెల్లూరు (టౌన్): సీఎంఏ ఫలితాల్లో జెనెక్స్ విజన్ అకాడమీ విద్యార్థులు ఆల్‌ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారని ఆ అకాడమీ డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు తెలిపారు. హరనాథపురంలోని జెనెక్స్ విజన్ అకాడమీలో సీఎంఏ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో జీ వెంకటేష్ (11), ప్రవీణ్‌కుమార్(28), సాయినాథ్‌సింగ్ (45) ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే సుహేల్ 428, చందు 412, మనోజ్‌కుమార్ 401 మార్కులు సాధించారని వివరించారు. సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో చెన్నకృష్ణయ్య 445, మహేష్ 423, సాద్విక 418, వినీత 411 మార్కులు సాధించారని తెలిపారు.

## క్యాంపస్‌కు 230 మంది ఎంపిక




నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో బ్లూస్టార్, పానాసోనిక్ ఎల్రక్టానిక్స్, టెక్ మహేంద్ర బీపీఓ, తదితర కంపెనీల ఆధ్వర్యంలో బుధవారం క్యాంపస్ ఎంపికలు నిర్వహించారు. క్యాంపస్ ఎంపికలకు మొత్తం 230 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 207 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను జేకేసీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు అభినందించారు.

## స్టెమ్ ల్యాబ్స్‌పై శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న సీమ్యాట్ అధ్యాపకులు అరుణ

నెల్లూరు (టౌన్): స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్టెమ్ ల్యాబ్స్‌పై ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీమ్యాట్ అధ్యాపకులు అరుణ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 32 పాఠశాలల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ మ్యాథమెటిక్స్ (స్టెమ్)లను ఏర్పాటు చేసిందన్నారు. ఉపాధ్యాయులకు స్టెమ్ ల్యాబ్ ఆవశ్యకత, విద్యార్థులకు ల్యాబ్ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఒకేషనల్ స్టేట్ ఇన్‌చార్జి భారతి మాట్లాడుతూ స్టెమ్ ల్యాబ్స్ విద్యార్థులకు వంద శాతం ఉపయోగపడేలా చూడాలన్నారు. అనంతరం రీసోర్స్‌పర్సన్లు రాములు, మస్తానయ్య, ఫణికుమార్, జిలానీ ల్యాబ్ నిర్వహణలో మెళకువలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ సుధీర్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, చలపతి, రాధారాణి, తదితరులు పాల్గొన్నారు.